శ్రీరస్తు శుభమస్తు



# సాయి సచ్చరిత్ర

**(మంగళవారం పారాయణ)**

**ద్విపద పాఠ్యము :**

**రచన :**


**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech




## ఆరవ అధ్యాయము

శ్లో॥ న గురో రధికం తత్త్వం, న గురో రధికం తపః
న గురో రధికం జ్ఞానం, తస్మైశ్రీ గురవే నమః

### దక్షిణ కోరటం ఎందుకు?

సాయినాథునిపైన జనులలో కలిగె
ఈయన దక్షిణ నేమి చేయుదురు

బాకీ అనేరీతి బాబా వసూలు
చేకొను వద్దనే చింతయేలేక

ఈ ఫకీరుకు డబ్బు ఇంత కాంక్షయిన
ఏ ఫలముగలుగు ఈ గురున్ కొలువ

ఈ వాదమప్రద ఎందరోగొనిరి
ఆవేశమును వీడి ఆలకించండి



ధనముతో మనుజుడు తానేమి చేయు
తిని త్రాగు తీర్చు సతిసుతుల వాంఛ

ఈ ఫకీరుకు లేవు ఇల్లు ఇల్లాలు
ఈ ఫకీరుకు బిచ్చమెందరో ఇడిరి

అయిననూ చూడుడు ఆ సంపదలతొ
సాయిచేయునదేమి చక్కగా కనుడు

ధనమంతపంచును తను అందరికిని
వానివానికి కల్గు బాధలనెంచి

తొలినాళ్ళ తను దయతో తిండి బెట్టి
జాలి చూపించిన జనని పుత్రుండు



'తాత్యా' కు ఇచ్చును తను కొంతధనము
నిత్యము మసిజీదు నెరపువారలకు

తనకు తోచిన యంతదయనిచ్చుగాని
తను దాచలేదేది తనబాగుకొరకు

చిలుమును పీల్చును జెండాలు కలవు
వెలిగించుధుని ఎట్లు విత్తంబులేక

అశ్వమ్మురధములు ఆ కిరీటంబు
ఈశ్వరుండా పల్లకెందుకాయనకు

ఈ రీతి నిందించ ఏ మాటఅనడు
చిరునవ్వు నిత్యము చిందించు సాయి

ఆడంబరాలన్ని ఆ భక్తులంత
చూడతరించుచు స్తోత్రాలు పాడ

తలకి చుట్టిన 'గుడ్డ' తనచేత 'చిప్ప'
వలువచిరిగిన 'కఫని' డొక్కు త్రాగ

ఇటువంటి 'రాజుకు' ఏల ధనంబు
ఎటువంటి ఉపయోగమేమి లాభంబు

ఒరులకై జీవించు ఉన్నతులకును
నిరుపయోగము కదా నిధి సంపదలును

సాయికిధనమేల సహచరుల్ కొరకె
ఆయన కేలయా ఆస్తి పాస్తులును

6.5

## మనోవైకల్యం మానలేమా

అందరూ సన్యాసమంద దుర్లభము
ఎందు బోవును సృష్టి యెల్లరిట్లయిన

బిక్షగైకొని ఋషుల్ విడిపించగలరు
తక్షణంబే మన తగులు బంధాలు

మనసున క్లేశాలు మనకడ్డు పడును
మనసు నిరోధించు మనిషి ఉత్తముడు

ఉత్తముండొక్కడే ఉర్వియంతటికి
ఉత్తమంబగు మోక్షమొందనర్హుండు

6.6

సంసారులును కూడ సతతంబు కోరు
సంసారముక్తిని చక్కగా ఇచ్చు

కోర్కెలనణచుటే గురు ముక్తి బాట
కోర్కెలే నరులను కూల్చు కారణము

కాంతాకనకమందు కాంక్షలే నరుని
అంతంబుగావించునని జెప్పుసాయి

వలయు దానిని మించి పైకంబు నరుని
నిలువునా ముంచును నిజము నమ్మండి

కాంతపై మోహము ఘనులనూ చెరచు
చింతకారణమగు జీవులకెల్ల

6.7

దానంబు నరులకు తరియించుదారి
ధనకాంక్ష చెరచును దానఫలంబు

దానమిచ్చిన గాని ధనకాంక్ష బోదు
దానికై చెయి జాచెదను నేను మీకు

ధనమేమి చేతురు తరుణి లేకున్న
వనితపై మోహమే పతనకారణము

దీనికై భక్తులన్ దీవించి సాయి
తానుంచు బస కూర్చితన వారికొరకు

రాధకృష్ణామాయి రక్షణనుంచు
పధకమ్ముతో నుంచు పనిబూనివారి

6.8

ఆ యింట వసియించి ఆమెతో తినుచు
సాయిధ్యాసతో నున్న చక్కగా నెగ్గ

నెగ్గలేకున్నచో నిందించడెపుడు
అగ్గియా కామము అని జెప్పు సాయి

మొదటి బాణము గురి మొనగాడి కవదు
వదలక సాధనపట్టు గెల్వాలి

మననిగాచుటకుతాన్ మారె బిషువుగ
ఆన, సాయిని మించు ఆ వేల్పు ఎవడు

రామునైనాగాని రాధాప్రియుడిని
తాము నిందించిరి తమనోటిదురద

6.9

తీరగ, షిరిడిలో దేవునేరీతి
దూరకుండుదురె ఈ ధూర్త మానవులు

అనుటయే కాదు ఈ అపనిందలన్ని
వినుట పాపము సాయి వేడుదమిపుడె

## అన్నదానం ఆ సాయి మార్గం

అన్నిదానములలో అన్నదానమును
మిన్నని చెప్పెను మేలుగ సాయి

భిక్షాటనమునకు వెళ్ళగా వచ్చు
భిక్షను ఒరులకు పెట్టక తినరు

తొలినాళ్ళ ఇంటింట దొరికిన భిక్ష
కలిపి ఒక్కటి చేసి కడుపార బెట్టి

6.10

భక్తులక్షుద్బాధ బాసిన పిదప
శక్తికైతిను సాయి రక్తికి కాదు

తరువాత భక్తులు తామే మసీదు
చేరి భిక్షనువేసి చేసిరి సేవ

ఒక పాత్రలోవేసి ఒకటిగా కలిపి
ఒకసారి నైవేద్యమొనరించు విభుకు

వేచిన ఆర్తులు విందుగా తినగ
తాచేరి భక్తుల ధన్యులన్ జేయు

శ్యామా, నిమోన్కరు సాహెబునాన
తాము వడ్డింతురందరు భక్తులకును

6.11

చిరునవ్వుతో సాయి చేయు వంటలను
అరయనాదృశ్యంబు ఆ జన్మఫలము

జొన్నఅంబలిబెట్టు అన్నంబువండు
ఉన్న చక్కెరసాయి ఒండు పొంగలిని

భాషచాలదు దాని వర్ణించ నాకు
ఆ షిర్డినాధుని 'ఆట' యే యంత

అన్నము వండుచు ఆ సాయి ఉడుకు
అన్నంబులో చేయి అవలీలనుంచు

ఉడుకు అయ్యెనొ లేదొ ఒకపరి జూడ
మడిచి చేతుల మీద మన్నెడి 'కఫని'

6.12

శీతోష్ణముల గెల్చు సిద్ధుల మహిమ
మతికెక్కునే కాదు మాయ ఎన్నడును

చొప్పదంటూ ప్రశ్న జూతము ఇచట
చెప్పుమన్నను సాయి చెందునెవ్వార

శాకహారియలేక సాయి మాంసమును
చేకొను వారలా చెప్పుడీ అనగ

ఏదైనతిను సాయి ఇతరుల కొరకె
ముదముగా భుజియించు మోహంబులేక

ఒకమాట వినరయ్య యోచించరయ్య
ఆకలిదప్పులు అందరికొకటె

6.13

మితియున్న అందరిన్ మించు ఉత్తముడు
మితిలేక ఆకలిన్ మెలగుజంతువుగ

అన్నదానమునకై ఆకలుండుటయె
మిన్నయౌ పాత్రత మిత్రమా అనిరి

పెట్టువానికియట్లె పైసలుండుటయె
గట్టియౌ అర్హత కలదేదివేరె

పాత్రా అపాత్రతల్ వాదము కొరకె
పాత్రంబు ముక్తికి బాబా సుసూక్తి

6.14

## చాందోర్కర్ గర్వభంగం

చాందోర్కరొకనాడు సాయినాథునికి
పొందుగా పిసుకుచూ పదములు తాను

గీతతా చదువ సాగెనుభక్తితోడ
ఆతని స్వరమున ఆసాయి వినెను

శ్లో ॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉప దేక్ష్యంతి తేజ్ఞానం జ్ఞానిన స్తత్వదర్శినః

**కాకా ఇదేమని** గౌరవంబలర
చేకొని ప్రశ్నించె షిరిడినాథుండు

6.15

**గీత, బాబా ఏదో గీర్వాణభాష**
ఆతని గొంతున అహము పొంగింది

**అదిసరే కొంచెము అర్థంబు దెలుపు**
**అదిఏమి 'ప్రశ్నేన' అన్నచో ఇచట**

ప్రశ్నించు అని చెప్ప, పరి ప్రశ్న అనిన?
ప్రశ్నించిరాసాయి భక్తుని మరల

**'బాగుగా ప్రశ్నించ'** భక్తుండు అనెను
**బాగుగా అన్నచో** బాబా అడిగిరి

6.16

బదులీయ లేకుండె భక్తుండు మరల
**"అదిసరే కృష్ణుడు అందరి గురుడు**

**ఏల క్రీడికి చెప్పె ఇటు గొల్వ గురుని?**
శిలవోలె బదులేమి చెప్పలేకుండె

**క్షమియించు మోదేవ!** చాందోర్కరనెను
నీముందు నేనెంత నీవే గురుడవు

నవ్వుచూ ఆ సాయినాధుండు జెప్పె
**ఎవ్వారినణగించు ఈ అహం బెపుడు**

**ఐహికంబులుగాని ఆముష్మికములు**
**ఊహకందకజేయు ఒసగును చెరుపు**

6.17

**వినయము లేకున్న విద్యనశించు**
**పెను అనర్థమ్ములు పీడించునతని**

గురుదేవు బోధన గురిబెట్టివినిన
చెరుపు తప్పించును చేయు మంగళము

**మీ యింటికి అతిధిగా వస్తాను**

హోళి పండగనాడు ఒకపరి తాను
కలలోన 'హేమాడు' గాంచె బాబాను

సాయి చెప్పిరి ఇట్లు సంతోషమలర
**ఓయి నీయింటి ఒత్తునీరోజు**

6.18

**అతిధిగా విందును అందించుమయ్య**
ఏతీరు జరుగును ఇది భ్రమ అనుచు

తలచెహేమాడిట్లు తనువీడి షిరిడి
ఏలవచ్చును సాయి ఇక్కడకిపుడు

అయిననూ విందులో అందరితోటి
సాయి ముఖ్యతిధిగా జరిపె వడ్డనలు

ఎంతసేపైనను ఏడి ముఖ్యతిధి
వంతతో సాయినే ప్రార్థించెనతడు

'ఆలీ అహమ్మదు' అనువాడువచ్చె
కలిసి 'మౌలాన'తో కనువిందు చేయ

6.19

**నీవస్తువొక్కటి నీకీయవలెను**
**నీవుగైకొనుమయ్య, నెమ్మదిగాను**

మిగతా విషయములు మెల్లిగా జరుగు
తగు సమయమున, నే దారి బట్టెదను

ఈరోజునేవత్తు ఈ మాటజరిగె
అరుదెంచె కదసాయి ఆశ్చర్యపడెను

తృప్తిగా భుజియించి తరలిరందరును
ఆప్తుడా సాయిని అతిధిగానెంచి

6.20

మానవ మాత్రులం మనకెట్లు తెలియు
ఘనసాయి లీలలు కలవోలె జరుగు

ఆన ఆ లీలలు అత్యద్భుతములు
స్వానుభవము నాకు సత్యమోరయ్య

ఈ కధలో వింత ఇపుడు తెల్పెదను
చేకూర్చు పులకింత చెమరు మీకనులు

ఆలీ మహమ్మదు అధ్యాత్మికుండు
గొలుచును బాబాను కూడిన గురుగ

వారి చిత్రపటంబువాని గృహమున
విరివిగా శోభతో వ్రేలాడుచుండు

6.21

కాలిపై వ్రణమయ్యె గాంచెవైద్యులను
కలిసి ఆతని బావగారితో అతడు

మూడు మాసములుగా మూసి గృహమును
విడిసె బావగృహము విడిదిగా గడిపె

'నూర్' ఆతనిది పేరు నోచడేగురుని
ఆ అయ్య ద్వేషించు అర్చనాదికము

నీ 'పిచ్చి' ఈ రోజునీ వ్యాధిపెంచె
ఆపక వాదించె అంత 'నూర్' అచట

అటు ఇటూ ఊగెడి ఆతని భక్తి
మటుమాయమైపోయె మాసె నమ్మకము

6.22

అడిగెనూర్ కోపించి అప్పుడే దాని
బడవేయసంద్రాన బంత్రోతు నొకని

రెండు నెలలపాటు లేదు గృహమున
పండెశస్త్రచికిత్స బాధతో అతడు

నయమైన ఆలీకి నమ్మిక కుదిరి
ఆయన తనఇల్లు అపుడు చేరాడు

ఎట్టెదురుగ చూచె ఈశ్వరున్ సాయి
నట్టింట గోడకు నవ్వ్‌చున్నట్లు

దుమ్ములేని పటంబు ధూళియులేదు
ఇమ్ముగ పెట్టిరి ఈ రోజెయట్లు

6.23

తనబావ 'నూర్' జూడతను రచ్చజేయు
మనసురాదితనికి పారేయ దాని

హేమాడు గురుతొచ్చి ఇచ్చిరమ్మంటు
తమపని వానితో దాని పంపారు

ఆయనకిచ్చాడు 'ఆలీ' స్వయముగ
సాయిమాటగ దాని చక్కగా తాను

ఇది కట్టు కధకాదు ఎనుబదేండ్లాయె
మదిగొనుడాసాయి మహిమలన్ తమరు

6.24

## మహిమ చూపమని అడుగవలెనా

'కాకా మహాజను'గారు 'ధక్కరుకు'
నౌకరై కొలిచిరి నమ్మికగాను

భృత్యుడు శ్రీ సాయి భక్తుండటంచు
అత్యంత శ్రద్ధతో అతనుండునంచు

ఎరిగిన ధక్కరు యేగి షిర్డీకి
అరయసాయి మహిమ ఆతండుకోరె

తనవెంటగొని పోయె ద్రాక్షపండ్లతడు
తనకాన్కగాయిచ్చె తను భక్తి మ్రొక్కి

భక్తులందరికిని పంచిరి సాయి
యుక్తిగా ధక్కరు ఉంచె 'జేబు' నను

6.25

తనపండ్ల గింజలన్ దాచియుంచేను
తనయిష్టుడైయుండె తనుజేయు పనికి

సాయిచెంతకుజేరి సాగిలి మ్రొక్క
ఆయన మరికొన్ని అతనికిచ్చారు

వాటిని దినమన వద్దనలేక
ఎటులనో నమిలెను ఇష్టంబు లేక

తను తిన్న పండ్లలో ధక్కరుగారు
కనుగొన నమిలియూ గాంచరేగింజ

భక్తితో మ్రొక్కిన వానిని జూచి
భక్తుడావింతను బడసినావుగద

అనునట్లు చూచిరి ఆ ధక్కరునికి
మనసు ఆనందాన మారాడకుండె

6.26

వింతలో వింతయూ వింత ఏమిటన
అంతమంది జనుల అందరిపండ్ల

ఉన్నవి గింజలు ఒక్కధక్కరుకె
ఎన్నఒక్కటిలేదు ఇదెసాయి మహిమ

రాజుయే తాను తలంచిననెపుడు
నిజముగా కొదవౌనె నింగియే దగును

## అబద్ధమాడకు నిజందాచినాసరే

సత్యహరిశ్చంద్రు సాటిగాకున్న
నిత్యమూ కల్లలు నీనోటవలదు

ఈ నాటి ఈనీతి ఎంతొమేలనిరి
ఆనాడె శ్రీసాయి ఆ గాధ వినుడు

6.27

'టెంబెస్వాముల'వారి టెంకాయగాధ
లంబోధరునిగొల్లి రవ్వంతవినుడు

తను రాజమండ్రిలో దయచేసినపుడు
వినివారిచూడనై ప్లీడరు ఒకడు

'పుండరీకుండ'ని ఉత్సాహమలర
దండప్రణామాలు తను చేసికొల్చె

షిరిడి పోదునటంచు చెప్పంగ నతడు
వారు **టెంకాయను బాబాకు ఇమ్ము**

అని చెప్పి యిచ్చిరి, అతిభక్తి గొనెను
తను 'స్వామి' వద్దను దాని ప్లీడరుయు

అరుదెంచుదారిలో అతని మిత్రునికి
విరివిగా ఆకలై వేడెను తినగ

6.28

కారపు అటుకులు కనుగొని తినెను
నోరుమండగ వాడునోటికేదైన

తీయంది ఇమ్మనె తీర్చదాహంబు
ఆయన టెంకాయ నపుడు కొట్టాడు

జలమును త్రాగిరి చక్కగావారు
ఒలిచికొబ్బరి తిని ఊరడిల్లారు

పరికించి చూడగా బాబాకునీయ
వారు తెచ్చినదదే పగులకొట్టారు

చేయునదియు లేక చేరిరి షిరిడి
సాయిని చూచిరి చక్కగా మ్రొక్క

**నాకు 'టెంబే' యిచ్చె నాదుటెంకాయ**
**నాకీయ వలె తెండు నాకు కావలెను**

6.29

కన్నీటితో వేడె కడుదీనముగను
**ఎన్నొ టెంకాయలు ఇత్తునో సాయి**

**వలదు నాకేదికావలెఅదేతెండు**
పలికిన సాయికి ప్రణమిల్లినారు

అప్పుడు సాయియు అనిరిల్లు **వినుడు**
**చెప్పనసత్యంబు షిరిడిలో వలదు**

**నిజము చెప్పుటకడు నిష్టురంబయిన**
**నిజముదాచుట కాదు నేరంబు నేడు**

**కల్లలాడుట మేలుకాదయ్య తుదిని**
**కల్ల కూల్చును కొంప కన్నీరు నిచ్చు**

6.30

చెంపవాచినయట్లు చెప్పియు స్వామి
ఇంపుగా తోచెను ఇతర భక్తులకు

జీవిత సత్యంబు చెప్పుటయందు
ఎవరు సాయికి సాటి ఈ జగంబందు

మనసు వానరమగు మనమాట వినదు
కనుకనే ముందుగా కట్టేయవలెను

అడిగినప్పుడు తిండి అందించి ఓర్పు
కూడి చూపించిన కూర్చును సమత

మాటవింటోందని మానినకట్టు
ఆటలాడించును అందదెన్నటికి

బాబాను చూడగ భక్తులు మూగ
తాబూని 'నానా'యు తప్పించసాగె

6.31

అందులో ముస్లిము అతివ నొక్కతెను
అందాల భరిణను అలవోకజూచి

'నానా' కు భ్రమకల్గి నయము కోల్పోయె
కనిపెట్టి రాసాయి కరుణతో అనిరి

**నానా చికాకులు నానా! అవేల**
**ఏ నేరమూకాదు ఈ అందములను**

**చూడనై ఇచ్చాడు చూపు దేవుండు**
**చూడనేరము కాదు చూపులో ఆశ**

**చూప నేరంబది జొప్పించి మనసు**
**నాప శ్రేయంబగు అదెనీతి యగును**

6.32

**ఆకలి వేళను అన్యులన్నంబు**
**చేకొన నేరంబు సేమంబు కాదు**

పరికించ అందము పాపంబుకాదు
బరిలేని నడతయే పాపంబు సుమ్మి

మనిషికి కీర్తిచ్చు మనసు నిగ్రహమె
మనిషి జీవితమంత మసలును శాంతి

నానాయు సిగ్గందినాడు ఆ సూక్తి
తనతప్పు తెలిపియు తనదు మర్యాద

కాచిన సాయికి కడుప్రీతిమ్రొక్కి
తాచేయ లేదట్టి తప్పునెన్నడును

6.33

## మొక్కుకోవటం అవసరమా?

మొక్కుకుందురుజనుల్ మూల్గి బాధలతొ
దిక్కునీవే అని దేవుళ్ళనెల్ల

అక్కర తీరాక అన్నియూ మరచి
మొక్కుపక్కకునెట్టి ముదమునుంటారు

బాబాకు ఇందులో పట్టుఅధికము
కాబోలు అందుకే గద్దించుతారు

ననువేడి నంతనే నాదయ కలుగు
నను మీరు మ్రొక్కుట నాకేలననిరి

6.34

**నాకు మ్రొక్కినవారు నన్ మరచినచొ**
**ఊకోను పట్టుగా ఉందును నేను**

**నా కసత్యంబన్న నచ్చదు సుంత**
**మీకు పాపంబగు మేలుకాదయ్య**

**దీనికై ఒక కథ తెలిపేరు సాయి**
వినిపింతు బాబాను వేడి ఆపైన

కులకర్ణి బాబాను కొల్చుదైవముగ
కలవలేదాతడు కాంచుచు కనుల

పనిపై భివాండీకి పయనమయ్యాడు
వారి ఇంటికి తానె వచ్చెను ఫకీరు

6.35

వేడెను భిక్షను, వింతగా జూచి
అడిగె సాయియ మీరఉ అతివ మృదువుగ

దేవునారాధింతు తెలియుమొా తల్లి
దేవుని బంటును తిరిపెమెత్తెదను

ఒకరూకనిచ్చెను  ఉవిద నమ్రతతొ
చేకొనె దీవించి చెప్పెను సెలవు

చెడిపని అశ్వము చీకాకు పెట్ట
అడుగెట్టె కులకర్ణి అంతలో తానె

వెను వెంటనే వాని వెదికె అంతటను
కనరాడు ఎవ్వరు కనడే ‘ఫకీరు’

6.36

**ఒకరూక ఇస్తివే ఉన్నచోనేను**
**చేకొని పదియైన చేతుదానమును.**

ఆనాడె కులకర్ణి అతనిమిత్రునితొ
చనెను వాహ్యాళికి సంధ్యవేళవగ

ఒకఫకీరాతడే ఒచ్చెవేడుచును
తాకోరె ఇమ్మనె దక్షణ అపుడు

ఒకరూక వద్దన, ఓర్చి భక్తుండు
చేకొని అప్పునిచ్చెను తాను ఐదు

అయిననూ కాదనె ఆ ఫకీరపుడు
పోయి ఇంటికి యిచ్చె పూనితొమ్మిదయె

6.37

మానక అటుపైన మాన్యుండు అడుగ
తన యింట 'పది'నోటుదానంబు చేసె

తొమ్మిది తిరిగిచ్చె తుదకాఫకీరు
ఇమ్మనె పదిచాలు ఇవిమొక్కలేదు

ఈపైన చెప్పుట కేమియూలేదు
తాపూని బాబాయె దరికొచ్చె నిజము

## గుడ్డపీలికల దొంగతనం

బాబాయు 'దేవ్' అనే భక్తునిపైన
చేబూని కరుణను షిరిదిరమ్మనిరి

6.38

అయిననూ అతనికి అరయకాంక్షయ్యె
సాయినాదుని మాయ స్వయముగా తానె

ఒరులను అడుగును ఓపికతోడ
అరయగల్గితిరిగా ఆసాయిమహిమ

'బాలకురాం'అను భక్తుని కలిసి
తెలుపుమ మహిమని దినదినంబడిగి

చీటికి మాటికీ చీకాకు చేయ
దాటవేయును మాట తానేమి అనడు

పిలిపించి రొకరోజు విభుడు బాబాయె
నిలిచికట్టెదురుగా నిలదీసినారు

6.39

**చింకిదుస్తులదాల్తు చేతిలో 'డొక్కు'**
**ఇంక తలకుగుడ్డ ఇవియె నా'ఆస్తి'**

**నాగుడ్డపీలికల్ నాకుగాకుండ**
**చేగొన వస్తివే ఛీఛీ ఇదేమి**

బిత్తరబోయెను పిచ్చెత్తి 'దేవు'
అత్తరి బాబాను అడిగెనిదేమి

**నీ కడ దొంగగు నీచుడుంటాడ**
**నాకేల ఈనింద ననుగావ దెలుపు**

బాబాఅనిన బోధ వాని కన్విప్పె
ఆబాటవీడక అందరే ముక్తి

6.40

నా దయగొనుమంచు నాదరి బిలువ
ఇది నీకు తగదయ్య ఇట్లడుగుటయు

పట్టువస్త్రము నిచ్చి వడి దాల్చమనిన
ఇట్టిమాటలు ప్రశ్నలిదె దొంగతనము

అందరూ నావారె అయ్యును నన్ను
పొందుచుందురు భక్తిపుణ్యంబువలన

ఒకరికి ముక్తియౌ ఒకజన్మలోనె
చేకొను పరమాత్మ చిద్విలాసముగ

ఒకరికి పరమాత్మ ఒనగూడదెపుడు
ఆకలి దప్పులే అతని జీవితము

6.41

## దాముకు నీతిబోధ

'దామూ'కు ఒకనాడు తగిలె సందియము
ఈమాదిరిగ సాయి ఈశ్వరుండయ్యు

కరుణించి తానేల కష్టాలు దీర్చి
వరములనీయడు భక్తులందరికి

చిరునవ్వుతో సాయి చెప్పిరీరీతి
వరములు శాపాలవని లోన లేవు

చేసిన పాపమే చింతలనిచ్చు
చేసిన పుణ్యమే చెలిమితోగాచు

పాపపుణ్యపులెక్క పరమాత్మకెరుక
కాపాడగల్గును కర్మపూర్తయిన

6.42

మామిడి పూతలు మనకి పండ్లిచ్చు
ఏమిపూతంతయూ ఇచ్చునే పండ్లు

పండ్లలో తీపిని బడయపు కొన్ని
పండ్లుగాలికి రాలి బాటలో చేరు

ఉపయోగమందవు ఉన్న కొన్నియును
ఆ పరమాత్ముడే ఆ తీరు ఎరుగు

భగవంతుడైనను బడసి జన్మంబు
వగచెను, మరణించె బాధలనొందె

కావడి కుండలీ కష్టసుఖాలు
ఎవరినీ వదలవు ఇది సత్యమయ్య

దైవ చింతయె ఇచ్చు ధరణిలో శాంతి
ఎవరైన కోరేది ఈ శాంతి ఒకటె

6.43

ఇకపైన రానీకు ఇట్టియోచనట
నీకు మేలీయవు నీ శాంతి చెరచు

## చావడి ఉత్సవం

పదితొందితొమ్మిది పది డిసెంబరున
మొదలయ్యె 'చావడి' ముందు ఉత్సవము

మసిజీదుతోపాటు మన సాయిబాబ
చేసిరి చావడి శ్రేష్ఠ వాసముగ

భక్తులుగూడుచూ పాడుచూనేగి
భక్తితోజరిపేరు పరగ కన్విందు

స్త్రీలు పాడుచుగూడి చేసినృత్యాలు
కొలుతురు సాయిని గొప్పసంబరము

6.44

ఆమహల్సాపతి ఆసాయి కుడిని
అమరు తాత్యాయు తానాయన ఎడమ

ఛత్రంబుతో 'జోగు' చక్కగానిలువ
చిత్రంపురీవితో చేతురుత్సవము

తప్పెట్లు తాళాలు తక్కినవారు
గొప్పగా మ్రోగించి కూడెదరచట

పల్లకీ ఆశ్వంబు బాబావెనుకనె
మెల్లిగా వచ్చును మెరియు చందమున

ఒంటిపై 'కఫసీ' తొ ఉత్తరీయముతొ
కంటికింపుగ సాయి కనిపించునపుడు

6.45

కాల్చి బాణాసంచ కడు సంతసమున
నిల్చి బారుగ చను నిజభక్తులంత

కుడిచెయ్యిఆడించు గురుడు ఆసాయి
వడిగ క్రిందకు పైకి వాద్యంపు జతగ

ఉదయభాస్కరుడట్లు ఉన్న ఆసాయి
ఆ దీక్షితుని పూలనంది శోభించు

రంగు గులాల్ పొడిన్ రాజిల్లుసాయి
హంగులన్నియుమన అందరికొరకె

చావడి చేరును సాయి ఊరేగి
ఆ వస్త్రములుమార్చి అమరించి నూత్న

6.46

తాత్యాయె బాబాకు ధరియింపజేయు
అత్యంత శోభతో అలర తురాయి

ఒక కిరీటంబును ఒప్పుగా దాల్చి
కూర్చొనునుసాయి తన ఆసనమున

కస్తూరి తిలకము కడుప్రీతి దిద్ది
ప్రస్తుతింతురు సాయిబాబాను అంత

ఆ 'నిమోన్కరు' బట్టు అందమౌ 'ఛత్రి'
తానుకూడా 'జోగు' దాల్చిపళ్ళెరము

షోడశ ఉపచార శోభాయమాన
కడుఘనపూజలు గావించు పిదవ

6.47

హారతి భక్తితో అందరూ కొనిన
తరువాత మొక్కుచు తనుబోవు జోగు

చివరగా తాత్యాయు చెప్పువందనము
ఆవిధి బోదురు అందరిండ్లకును

తన పాన్పుపై రెండు తలగడలుంచి
తనునిద్రబోవును తల ఎత్తుబెట్టి

**ఆరవ అధ్యాయము**

**శ్రీసాయినాథార్పణమస్తు**

**ఓం నమో భగవతే సాయినాథాయ**

* * *

6.48